## తాగునీటి సరఫరా కార్యాచరణ రూపకల్పన

### వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

### పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రానున్న రెండు నెలల పాటు ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా జరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకొని సన్నద్ధంగా ఉండాలని, ప్రతి రోజూ తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తూ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా అంశాన్ని పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజూ పర్యవేక్షించాలని, జిల్లాలో సజావుగా తాగునీటి సరఫరా జరిగేలా ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, అమ్మ ఆదర్శ పాఠశాల జిల్లాలో 697 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంఆర్‌కు సంబంధించి రైస్ మిల్లులను తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ ఇరిగేషన్ వెంకటేశ్వరరెడ్డి, సీపీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

### అదనపు కలెక్టర్ విద్యాచందన

నీటి వసతులను పరిశీలించి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచ, ఏప్రిల్ 1 : వేసవికాలంలో గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన అధికారులను ఆదేశించారు. సోమవారం పాల్వంచ మండలంలోని ఉల్వనూరు, గంగాదేవిపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సోలార్‌పంపు, గ్రామంలో ఉన్న బోర్లు, నీటినల్లాల నుంచి మంచినీరు ఎలా వస్తుందో పరిశీలించారు. సోలార్ పంపు రిపేరుకు అంచనాలు తయారు చేయించి కలెక్టర్‌కు అనుమతి కోసం వీలైనంత త్వరగా పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో నారాయణ, మిషన్ భగీరథ ఏఈ నీలావతి, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

## రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ. 30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## భద్రాద్రి స్వరాభిషేకం, నృత్యాభిషేకానికి అనుమతులు రద్దు

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఉత్తర ద్వారం వద్ద ఈ నెల 15న నిర్వహించనున్న భద్రాద్రి నృత్యాభిషేకం, స్వరాభిషేకానికి అనుమతులు రద్దు చేశామని దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం వైకుంఠ ద్వారం వద్ద బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, భద్రాచలం వారు నిర్వహించే భద్రాద్రి నృత్యాభిషేకం, భద్రాద్రి స్వరాభిషేకానికి ఎటువంటి విమర్శలకు తావు లేకుండా కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించామన్నారు. కానీ వారు దేవస్థానం వారి సూచనలకు విరుద్ధంగా దేవస్థానం కల్యాణ మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుగా అర్థం వచ్చే రీతిలో ఆహ్వాన పత్రికలు తయారు చేయించి, సోషల్ మీడియాలో ఉంచారని, దేవస్థానం కీర్తి, ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించడంతో అనుమతులను రద్దు చేయడం జరిగిందని ఈఓ పేర్కొన్నారు. అదేవిధంగా బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, భద్రాచలం వారికి నోటీసు జారీ చేశామన్నారు.

## శ్రీరామ నవమి ఆన్‌లైన్ టికెట్లకు భారీ స్పందన

భద్రాచలం, ఏప్రిల్ 1: సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17, 18తేదీల్లో నిర్వహించే శ్రీరామ నవమి, పట్టాభిషేకం ఆన్‌లైన్ టికెట్లకు భారీ స్పందన లభిస్తున్నదని దేవస్థాన అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1ఏ ఉభయ దాతల టికెట్లు రూ.7500ల విలువ గల 750 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచగా ఆదివారం సాయంత్రం వరకు 142 టికెట్లను భక్తులు బుక్ చేసుకున్నారన్నారు. సెక్టార్ 1బీ రూ. 2500లు ధర గల 590 టికెట్లు అందుబాటులో ఉంచగా 57టికెట్లు, సెక్టార్ 1డీ రూ.వెయ్యి విలువ గల 395 టికెట్లను ఉంచగా 105టికెట్లు, సెక్టార్ 2ఏ రూ. 300ల విలువ గల టికెట్లు 490 ఆన్‌లైన్‌లో ఉంచగా 359టికెట్లు బుక్ అయ్యాయని అధికారులు పేర్కొన్నారు.

## మార్చిలో రామయ్యను దర్శించుకున్న 2.15లక్షల మంది భక్తులు

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలం సీతారామచంద్రస్వామిని మార్చి నెలలో 2,15,450మంది భక్తులు దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25న అత్యధికంగా 14,304 మంది భక్తులు, మార్చి 5న కేవలం 3,958మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు.

## బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 1: ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో మార్చి నెల బొగ్గు ఉత్పత్తి , ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. మార్చి, 2024 నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 5.50 లక్షల టన్నులకు గాను 4.97 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# పన్నులు 73 శాతం వసూలు

## లక్ష్యాన్ని ఛేదించని 'గూడెం' మున్సిపాలిటీ

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 1 : ప్రజలు చెల్లించే పన్నులే మున్సిపాలిటీ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పాటునిస్తాయి. ప్రజలకు తాగునీరు, ప్రతి వార్డుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, చెత్తను డంపింగ్‌యార్డుకు చేర్చడం, ఇతరత్రా సేవలను అందించడంలో మున్సిపల్ అధికారులు ఎప్పుడూ ముందువరుసలో ఉంటారు. ఇంటి యజమానులు తాము పొందుతున్న సేవలకు ఏడాదికొకసారి ఇంటి పన్నులు చెల్లించడం జరుగుతోంది. ప్రతి ఏడాది దాదాపుగా 95శాతంపైగా ఇంటి పన్నులు మున్సిపల్ ఖజానాకు చేరుతాయి. కానీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి మాత్రం 73శాతం మాత్రమే పన్నులు వసూళ్లయ్యాయి.

**73 శాతమే వసూలు..**

పన్నుల వసూళ్లకు ప్రతి ఏడాదిలాగానే మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. ప్రత్యేక టీంలను ఏర్పాటుచేశారు. నెలరోజులుగా పట్టణంలో విస్తృతంగా ప్రచారం సైతం చేశారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో వసూలు కాలేదు. పన్ను బకాయిదారులకు 90శాతం వడ్డీ రాయితీ అవకాశాన్ని కల్పించినా సద్వినియోగం చేసుకోలేదనే చెప్పాలి. కొత్తగూడెం పట్టణంలో మొత్తం మున్సిపల్ లెక్కల ప్రకారం 23,369 అసెస్‌మెంట్లు(గృహాలు) ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.5.50 కోట్లుగా నిర్ధారించారు. కానీ సుమారు రూ.4 కోట్ల వరకు మాత్రమే వసూలు చేశారు.

### లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేశాం

నిర్దేశించిన పన్నుల వసూళ్లకు తీవ్రంగా కృషిచేశాం. సిబ్బందిని టీములుగా విభజించి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేకంగా కేటాయించాం. పలుమార్లు ఇంటి యజమానులను హెచ్చరించ్చాం. అయినప్పటికీ వసూళ్లలో వెనునబడ్డాం. ఈ విషయంపై పునఃసమీక్షించుకొని రాబోయే రోజుల్లో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తాం.

**- టి.శేషాంజనేయస్వామి, మున్సిపల్ కమిషనర్**

# కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

అశ్వారావుపేట, ఏప్రిల్ 1: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని అశ్వారావుపేట సొసైటీ సీఈవో మానేపల్లి విజయ్ బాబు, నయాబ్ తహసీల్దార్ సుచిత్ర అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో వారు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రేడ్-1 ధాన్యం క్వింటాకు రూ.2,203 సాధారణ రకం రూ.2,183 చొప్పున చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో మోరటరింగ్ ఆఫీసర్ బీ ఏడుకొండలు, ఏఈవో సతీశ్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెవెన్యూ, సొసైటీ ఉద్యోగులు

**దమ్మపేట మండలంలో..**

దమ్మపేట, ఏప్రిల్ 1: దమ్మపేటలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో, జగ్గారం, గణేశ్‌పాడు, మల్కారం, గండుగులపల్లి గ్రామాల్లో గిరిజన సహకార సంస్థ మేనేజర్ నర్సింహారావు సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

**అన్నపురెడ్డిపల్లి మండలంలో..**

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1: గుంపెన సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గుంపెన, ఊటుపల్లి, నామవరం, అన్నపురెడ్డిపల్లి, తెలిజర్ల, అబ్బుగూడెం గ్రామాల్లో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏవో పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో ప్రశాంత్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

**బూర్గంపహాడ్ మండలంలో...**

బూర్గంపహాడ్, ఏప్రిల్ 1: మండలంలోని సంజీవరెడ్డిపాలెం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, మోరంపల్లిబంజర్, సోంపల్లి, లక్ష్మీపురం, కృష్ణసాగర్, ఇరవెండి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మణుగూరు ఏడీఏ తాతారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో శంకర్, ఏఎంసీ గ్రేడ్-3 సెక్రటరీ నిర్మల, పీఏసీఎస్ సీఈవో బీవీ ప్రసాద్, సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

**చల్లసముద్రంలో..**

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని చల్లసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సెక్రటరీ జీ హరిప్రసాద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చల్లసముద్రం సెంటర్ ఇన్‌చార్జి పీ రమేశ్, రైతులు ధనియాకుల వెంకటేశ్, యాదగిరి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది వందశాతం బొగ్గు ఉత్పత్తి

### లక్ష్యాన్ని ఛేదించిన సింగరేణి

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 1 : సింగరేణి సంస్థలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్య సాధనలో వందశాతం బొగ్గు ఉత్పత్తి చేసింది. ఆర్థిక సంవత్సరం చివరిరోజు నాటికి వందశాతంతో విజయఢంకా మోగించింది. ఒడిదుడుకులను అధిగమించి సమన్వయంతో లక్ష్యాన్ని సాధించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సీఎండీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### బొగ్గు ఉత్పత్తి వివరాలు..

| ఏరియా | టార్గెట్ | సాధించిన బొగ్గు ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| కొత్తగూడెం | 129,50,000 | 138,00,000 | 107 |
| ఇల్లెందు | 40,00,000 | 43,69,246 | 109 |
| మణుగూరు | 119,50,000 | 126,91,050 | 106 |
| బెల్లంపల్లి | 36,50,000 | 37,50,000 | 103 |
| మందమర్రి | 46,10,000 | 41,93,020 | 91 |
| శ్రీరాంపూర్ | 66,40,000 | 59,06,089 | 89 |
| ఆర్జీ1 | 43,80,000 | 44,95,256 | 103 |
| ఆర్జీ2 | 96,50,000 | 98,50,044 | 102 |
| ఆర్జీ3 | 55,00,000 | 59,10,810 | 107 |
| అడ్రియాలా | 17,30,000 | 14,70,266 | 85 |
| భూపాలపల్లి | 49,40,000 | 35,85,029 | 73 |
| మొత్తం | 700,00,000 | 700,20,810 | 100 |

## సీసీ కెమెరాలతో నేరస్తులకు చెక్ పెట్టవచ్చు....

సీసీ కెమెరాలతో భద్రాచలం ఏఎస్పీ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది

భద్రాచలం, ఏప్రిల్ 1: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరస్తులకు చెక్ పెట్టవచ్చని భద్రాచలం ఏఎస్పీ అన్నారు. ఆటో యూనియన్ నాయకులు, ఇండస్ట్రీయల్ యూనియన్ నాయకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 32 సీసీ కెమెరాలకు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పట్టణ ప్రజలను చైతన్య పరిచి సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు పీవీఎన్ రావు, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## 7న సైనిక్ స్కూల్, ఇంటర్ ప్రవేశ పరీక్ష

భద్రాచలం, ఏప్రిల్ 1: వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్లో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ప్రవేశాలకు ఈనెల 7వ తేదీన ఖమ్మంలోని (ఎస్ఓఈ)ప్రతిభా కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, గురుకుల ఆర్సీవో తుమికి వెంకటేశ్వరరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో ప్రవేశానికి 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు కోరారు.

## సంక్షిప్తం..

### బార్ అసోసియేషన్ ఎన్నికలు టై

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నిక టై అయింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి విశ్రాంత ఏపీపీ కోట దేవదానం, పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది టీ చైతన్య పోటీ చేశారు. ఎన్నికలో మొత్తం 98 ఓట్లు. కోట దేవదానంకు 49, టీ చైతన్యకు 49ఓట్లు రావడంతో ఎన్నిక టై అయింది. దీంతో మొదటి ఆరు నెలలు టీ చైతన్య బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా, మిగిలిన ఆరు నెలలు కోట దేవదానం కొనసాగేందుకు ఇరు ప్యానెల్‌లో అంగీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలి

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 1 : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న ధోబీ కాంట్రాక్టు కార్మికులకు పదినెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. భూక్యా రమేశ్, సురేందర్, నిర్మల, భాగ్యశ్రీ, కుమార స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

### రేపు 5కే రన్

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 1 : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో ఓటర్ అవర్నెస్ 5కే రనర్‌ను ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్ ఫారెస్టు సెంట్రల్‌పార్కు వరకు కొనసాగుతుందన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

చర్ల, ఏప్రిల్ 1: క్రీడలవల్ల మానసిక ఉల్లాసం, శారీరక ధారుఢ్యం పెరుగుతుందని బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని దేవరపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కారం ఆనంద్‌బాబు మెమోరియల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెల్లం లక్ష్మీనారాయణ, సునీల్‌కుమార్, పవన్‌కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### పాన్‌షాపుల తనిఖీ

టేకులపల్లి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని పాన్ షాపులను టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్, ఎస్సై రవూఫ్ సోమవారం తనిఖీలు చేశారు.

### 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

సారపాక, ఏప్రిల్ 1: నవోదయ ఫలితాల్లో బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు కే హితేంద్ర, కే నేత్ర నిఖిల్ సీట్లు సాధించారని విద్యాసంస్థల అధినేత బీఎన్ఆర్ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించి బహుమతులు అందజేశారు.

### సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చండ్రుగొండ, ఏప్రిల్ 1: సైబర్ మోసాలు, మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మాచినేని రవి గ్రామస్తులకు సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహనదారులకు, గ్రామస్తులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

### తాగునీరు అందించాలని వినతి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 1: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీరు అందకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారని, తాగునీరు అందించాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా సోమవారం చేపట్టి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య ధర్నాలో పాల్గొని మద్దతు పలికారు. వీరమాచినేని వినీల్, నల్లపు దుర్గాప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

### కిరణ్‌కు ఆటోడ్రైవర్ల నివాళి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 1: ఇప్టూ రాష్ట్ర నాయకుడు వడ్లకొండ కిరణ్ ఇటీవల మృతిచెందాడు. సోమవారం పట్టణంలోని కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఇల్లెందు తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇప్టూ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, గుగులోత్ మదర్, బానోత్ అశోక్, కమలాకర్, తాటి రవి, రాజేశ్, పవన్ పాల్గొన్నారు.

### రూ.1.20లక్షల నగదు పట్టివేత

సారపాక, ఏప్రిల్ 1: మండలంలోని మోరంపల్లిబంజర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద సోమవారం అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహబూబాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న మినీ వ్యాన్‌లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.20లక్షలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాగభిక్షం తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో ఎస్ఎస్‌టీ బృందం మెజిస్ట్రేట్ హెడ్ చెన్నం పృథ్వీతేజ, హెడ్ కానిస్టేబుల్ కే వెంకటేశ్వర్లు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

### ఏరియా జీఎంకు సన్మానం

రామవరం, ఏప్రిల్ 1 : సింగరేణి కొత్తగూడెం ఏరియాకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సందర్భంగా ఏరియా జీఎం శాలెంరాజుకు ఏఐటీయూసీ బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. జీఎంకు శాలువా కప్పి సత్కరించారు.

### ఘనంగా నగర సంకీర్తన

పాల్వంచ, ఏప్రిల్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి వివిధ ప్రాంతాల్లో నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 4వ తేదీన స్వామివారి కల్యాణ క్రతువు జరగనుంది.

### ఎండలకు అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1: వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. సోమవారం మండలంలోని గుంపెన గ్రామంలో జామాయిల్ కూలీలకు ఎండాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

టేకులపల్లి/ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 1: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో కేవోసీ ప్రభావిత ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేవోసీ ప్రభావిత పునరావాస ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు.18 నుంచి 42 సంవత్సరాలు కల యువతీ యువకులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎస్సీసీఎల్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసి ప్రింట్ కాపీ సర్టిఫికెట్లను ఇల్లెందు ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### గ్రావిటీ స్కూల్ విద్యార్థి ప్రతిభ

టేకులపల్లి, ఏప్రిల్ 1: ఆదివారం ప్రకటించిన నవోదయ ఫలితాల్లో పట్టణంలోని గ్రావిటీ ప్రీమియర్ స్కూల్‌కు చెందిన బీ రిషి సీటు సాధించాడని గ్రావిటీ స్కూల్ చైర్మన్ బోడ పూనియ నాయక్ తెలిపారు. రిషిని పాఠశాల చైర్మన్, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట, ఏప్రిల్ 1: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన కునుసోతు మోహన్‌రావు(45) మార్చి 30వ తేదీన భార్య లలితతో ఘర్షణ పడి దాడి చేశాడు. అడ్డుకోబోయిన పెద్ద కుమార్తెపై చెయ్యి చేసుకున్నాడు. దీంతో మనస్థాపం చెందిన కుమార్తె ఇంటి ఆవరణలోని బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు ఆమెను బయటకు తీయటంతో ప్రాణాపాయం తప్పింది. తన కుమార్తెకు ఏమైనా అవుతుందేమోనని మోహన్‌రావు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులకు తాను గడ్డి మందు తాగలేదని చెప్పి ఇంటికి వచ్చాడు. 31వ తేదీన మోహన్‌రావు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సిఫార్సు మేరకు కొత్తగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు చందు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపారు.

## ఆటోడ్రైవర్ ఆత్మహత్య

రామవరం, ఏప్రిల్ 1 : తరచుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెం టౌన్ పరిధిలోని లక్ష్మీపురంతండాకు చెందిన భూక్యా కిషన్(40) తరచుగా అనారోగ్యానికి గురయ్యేవాడు. ఫిట్స్ రావడంతోపాటు పలు అనారోగ్య సమస్యల ఉన్నాయి. ఎప్పుడు నిరాశతో బాధపడుతుండటే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రోజులాగే ఉదయం ఇంటి నుంచి ఆటో నడపటం కోసం అని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే లక్ష్మీపురం తండా నుంచి గరిబ్‌పేటకు వెళ్లే మార్గంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె 